

కొంత మోదం.. ఖేదం



మహబూబాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : శాసనసభలో గురువారం ఆర్థికమంత్రి భట్టి విక్రమార్కమల్లు శనివారం ప్రవేశపెట్టిన 2024-2025 బడ్జెట్‌లో మహబూబాబాద్ జిల్లాకు పెద్దగా కేటాయింపులు జరుగలేదు. జనరల్‌గా ఇచ్చే ఫండ్స్ తప్ప.. ప్రత్యేకంగా నిధులు ఏమి ఇవ్వలేదు. ఈ సారి బడ్జెట్‌లో కొన్నివర్గాలకు ప్రయోజనం, మరికొన్ని వర్గాల్లో నిరాశను మిగిల్చింది. ఆరు గ్యారెంటీలతో పాటు వివిధ పథకాలకు కేటాయింపుతో జిల్లాలో ఆయా పథకాల లబ్ధి కోసం ఎదురుచూస్తున్న వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాకు ప్రత్యేకంగా ఏది అందించకపోయినప్పటికీ శాఖలవారి కేటాయింపుల్లో- జిల్లాకు వచ్చే వాటాపట్ల ప్రజల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఆరు గ్యారెంటీలు, పంచాయతీరాజ్, పురపాలక, విద్యుత్, నీటిపారుదల శాఖల కేటాయింపులు అధికంగా ఉండడంతో సాధారణ రాయితీలు, సంక్షేమ పథకాలతో జనాల్లో కొంతసంతృప్తి ఉంది. జిల్లా వ్యవసాయ, విద్యారంగానికి ప్రత్యేకంగా ఎలాంటి కేటాయింపులు లేవు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు రూ.23, 196 కోట్ల కేటాయింపులతో జిల్లాలోని 1.22 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది.


- 'గ్యారెంటీ' కేటాయింపులపై హర్షాతిరేకాలు
- పథకాల అమలుపై ప్రజల్లో ఆశలు
- 'గృహజ్యోతి' పట్ల మహిళలు సానుకూలం
- జిల్లాలో 2.44 లక్షల మంది ఆరు గ్యారెంటీల దరఖాస్తుదారులు
- బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసేలేదు
- మామిడి మార్కెట్ ఏర్పాటుపై ప్రస్తావన కరువు
- పీజీ కళాశాలల కొత్త భవనాలకు కేటాయింపుల్లేవ్
- రాష్ట్ర బడ్జెట్‌లో మానుకోటకు నిధులు అంతంతే..!

మానుకోట జిల్లాలో 18 మండలాల్లో 287 రెవెన్యూ గ్రామాలు, 461 గ్రామపంచాయతీలున్నాయి. 7,10,848 ఎకరాల్లో 2,877 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో జిల్లా విస్తరించి ఉండగా, ఇందులో 3,24,993 ఎకరాల అటవీప్రాంతం ఉంది. జిల్లాలోని 3,48,687 ఎకరాల్లో వివిధ పంటలను 1,22,597 మంది రైతులు సాగు చేస్తున్నారు. వీరిలో 75, 881 మంది పురుషులు, 46,716 మంది మహిళా రైతులు ఉన్నారు. జిల్లాలో వరి 1,32,246 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుండగా పత్తి 45, 778 మెట్రిక్ టన్నులు, మొక్కజొన్న 54,605 మెట్రిక్ టన్నులు, వేరుశెనగ 24,300 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి నిధులు..

రాష్ట్రంలోని బీసీలకు పెద్దపీట వేస్తూ బీసీల సంక్షేమానికి రూ.8 వేల కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.21,874 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.13, 013 కోట్లు కేటాయించడంతో ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. గత బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి ప్రత్యేక ప్రగతి నిధికి రూ.15,223 కోట్లు కేటాయించారు. ప్రజాసంక్షేమంపై ప్రధానంగా దృష్టి సారించి, బడ్జెట్ కొన్నివర్గాలకు ప్రయోజనం మరికొన్నివర్గాల్లో నిరాశలను మిగిలించిందని చెప్పవచ్చు.

ఆరు గ్యారెంటీలపైనే ఫోకస్..



ఆరు గ్యారెంటీలపైనే రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వీటి అమలు కోసం రూ.53,196కోట్లు కేటాయించారు. దీంతో అత్యధికంగా గిరిజన జనాభాతో ఉన్న మహబూబాబాద్ జిల్లాలో వివిధ పథకాల దరఖాస్తుదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఆరు గ్యారెంటీల కోసం 2,44,506 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో అధికంగా ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్నవారే ఉన్నారు. వ్యవసాయాధారిత జిల్లాగా పేరున్న మహబూబాబాద్‌లో వ్యవసాయ రంగానికి గత ఏడాది .రూ.26,831 కోట్లను కేటాయించగా ఈ ఏడాది రూ.19,746 కోట్లను కేటాయించడం గమనార్హం. మరోవైపు రైతుబంధు, రైతుబీమా పథకాలను కొనసాగిస్తూ ఈ ఏడాది రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని బడ్జెట్‌లో నిర్ణయించగా, ఆయా రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. మొత్తంగా వ్యవసాయ రంగానికి గతంలోకంటే తక్కువ కేటాయించడం కొంత నిరాశ కలిగిస్తోంది.

జిల్లాకు మొండిచేయే..

గత బడ్జెట్ మాదిరిగానే ఈసారి సైతం రాష్ట్రవ్యాప్తంగా వచ్చే పథ కాలు మినహా.. మహబూబాబాద్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ల పరిధిలో వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసే పరిశ్రమలను ఏర్పాటు చేయలేదు. బడ్జెట్‌లో గత ప్రభుత్వాల మాదిరిగానే బయ్యారంలో ఉక్కుపరిశ్రమ ఊసేలేదు. మహబూబాబాద్ మండలం మల్యాలలో కృషి విజ్ఞాన కేంద్రం జెన్నారెడ్డి వెంకటరెడ్డి స్మారక ఉద్యానవన ఫల పరిశోధన కేంద్రానికి అనుబంధంగా వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటవుతుందని ఆశించినప్పటికీ ఎలాంటి ప్రకటన రాకపోవడంతో నిరాశే ఎదురైంది. జిల్లాలో మామిడి తోటలు 7512.15 హెక్టార్లలో ఉండగా, 7512 మెట్రిక్ టన్నుల మామిడి సగటు ఉత్పత్తి ఉంది. మామిడి క్రయ విక్రయాలకు ప్రత్యేకంగా మామిడి మార్కెట్ ఏర్పాటు చేయాల్సి ఉండగా ఈ బడ్జెట్‌లో దాని ప్రస్తావన లేదు. విద్యారంగంలో మహబూబాబాద్ పీజీ కళాశాలకు సొంత భవనాలు, కొత్త కోర్సుల ప్రకటన సైతం వెలువకపోవడంతో విద్యార్థుల్లో నిరాశ నెలకొంది.

మేడిగడ్డకు సీఎం రేవంత్‌రెడ్డి



- 13వ తేదీన ఎమ్మెల్యేలతో కలిసి బ్యారేజీ పరిశీలన
- అసెంబ్లీలో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి
- అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాళేశ్వరం అవినీతిపై ఫోకస్
- ప్రజల్లోకి బీఆర్ఎస్ అవినీతిని తీసుకెళ్లేలా కాంగ్రెస్ వ్యూహం



వరంగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న మేడిగడ్డ బ్యారేజీ పరిశీలనకు వస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ మేరకు సీఎం అసెంబ్లీలో ఎమ్మెల్యేలతో కలిసి మేడిగడ్డ బ్యారేజీ పరిశీలనకు వెళుతున్నట్లు ప్రకటించారు. దీంతో సీఎం, ఎమ్మెల్యేల పర్యటనల నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా మేడిగడ్డ పర్యటనకు వచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. అయితే బీఆర్ఎస్ శాసనసభ పక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కూడా మేడిగడ్డకు రావాలని సీఎం ఆహ్వానించారు.

బాధ్యులపై సర్కారు కొరడా

గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, అక్రమాలపై కొత్త ప్రభుత్వం దృష్టి పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ 20వ పిల్లర్ కుంగిపోయింది. నాణ్యత లోపంతోనే బ్యారేజీ కుంగిందని, తాము అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. స్వయంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సైతం గత ఏడాది నవంబరు 2వ తేదీన బ్యారేజీ పరిశీలించారు. డిసెంబరు 7న కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టిపెట్టారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలోని లోపాలతో పాటు బాధ్యులను గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారుల బృందం నెల రోజులు వివిధ ప్రాంతాల్లో తనిఖీలు, ఫైల్స్ స్వాధీనం, ఇంజనీర్ల విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో భారీ అక్రమాలు జరిగినట్లుగా, నాణ్యత లోపంతో పాటు డిజైన్ లోపం ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో సాగునీటి శాఖ ఈఎన్‌సీ (జనరల్) మురళీధర్‌ను రాజీనామా చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. అలాగే రామగుండం ఈఎన్‌సీ, కాళేశ్వరం ఇన్‌చార్జి నల్లా వెంకటేశ్వర్లను పదవిని తొలిగించింది.

బీఆర్ఎస్ అవినీతిని ఎండగట్టేలా..

మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోడంపై అప్పటి కేసీఆర్ ప్రభుత్వంలో బాధ్యులు ఎవరనేదానిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిపెట్టింది. మేడిగడ్డ బ్యారేజీలోని లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. డిసెంబరు 11వ తేదీన భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో జలసౌధలో నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిపోర్టు మొత్తం తమకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆ తరువాత డిసెంబరు 16వ తేదీన శాసన మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని ప్రకటించారు. డిసెంబరు 17వ తేదీన నీటిపారుదల శాఖ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్ష చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపైన, మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి గల కారణాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి పూర్తి నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. డిసెంబరు 18వ తేదీన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్లు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, బి.నాగేంద్రతో పాటు ఎల్‌అండ్‌టీ కంపెనీ వైస్‌ప్రెసిడెంట్ దేశాయ్ తదితరులతో మేడిగడ్డపై సమీక్ష నిర్వహించారు. కుంగిన మేడిగడ్డ

మిగతా 8వ పేజీలో

ఏడుగురు తహసీల్దార్ల బదిలీ

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 10 : జిల్లా వ్యాప్తంగా ఏడుగురు తహసీల్దార్లు బదిలీ కాగా, వారి స్థానాల్లో ఇతర జిల్లాలకు చెందిన తహసీల్దార్లను కేటాయిస్తూ శనివారం చీఫ్ కమిషనర్‌ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో 132 మంది బదిలీ కాగా, అందులో మహబూబాబాద్ జిల్లాకు చెందిన వారు ఏడుగురు ఉన్నారు. నర్సింహులపేట తహసీల్దార్ జీ.వివేక్, బయ్యారం తహసీల్దార్ ఎం.ఇమ్మాన్యుయేల్, డోర్నకల్ తహసీల్దార్. ఎ.నాగభవాణి, గార్ల తహసీల్దార్ కె.స్వాతిబిందు, గూడూరు తహసీల్దార్ ఎం.అశోక్‌కుమార్, ఇనుగుర్తి తహసీల్దార్ తోట సూర్యనారాయణ, సీరోలు తహసీల్దార్ సీహెచ్.నరేష్‌ను భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు బదిలీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ తహసీల్దార్ సాధియా సుల్తానా, జూలురుపాడు తహసీల్దార్ ఆర్.శారద, పాల్వంచ తహసీల్దార్ సీహెచ్.నాగరాజు, టేకులపల్లి తహసీల్దార్ కె.కృష్ణవేణి, ఖమ్మం ఆర్డీవో కార్యాలయ డీఏవో ఎస్.శ్వేత, ఇదే జిల్లాకు చెందిన తహసీల్దార్ ఎం.శైలజ, ములుగు కలెక్టరేట్ సూపరిండెంట్ సీహెచ్. రవీందర్‌ను మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్లు మండలాల బాధ్యతలను కేటాయించనున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

జడ్పీ సీఈవో రమాదేవి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 : పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, అత్యుత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేయాలని జడ్పీ సీఈవో రమాదేవి సూచించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాలతో పర్వతగిరి గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను శనివారం జడ్పీ సీఈవో, మండల ప్రత్యేక అధికారి రమాదేవి సందర్శించారు. ఎస్సెస్సీ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీసీఈవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మేధోశక్తిని పెంపొందించుకుని లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. ప్రతీ విద్యార్థి గణిత, సైన్స్, ఆంగ్లం, జీకేతో పాటు ప్రతీ సబ్జెక్టుల్లో పట్టు సాధించాలని సూచించారు. ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు కేవలం 37 రోజులు మాత్రమే ఉన్నాయని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారు ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, హెచ్ఎం మందుల శ్రీరాములు పాల్గొన్నారు.



పర్వతగిరి పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రమాదేవి

నేడు గురుకులాల్లో ప్రవేశానికి పరీక్ష

- జిల్లా వ్యాప్తంగా 9 సెంటర్ల ఏర్పాటు
- హాజరుకాన్ను 2,974 మంది విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 : జిల్లా వ్యాప్తంగా ఆదివారం (నేడు) ఐదో తరగతిలో గురుకులంలో ప్రవేశాలకు ఉమ్మడి అర్హత పరీక్ష జరుగుతుందని సాంఘిక సంక్షేమం గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి ప్రత్యూష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో వివిద గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందేందుకు మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 2,974 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా, 9 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహిస్తామని, ఎగ్జామ్‌కు హాజరయ్యే విద్యార్థులు గంట ముందుగానే సెంటర్‌కు చేరుకోవాలన్నారు. మహబూబాబాద్ టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల సెంటర్‌లో 384, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల తొర్రూరులో 384, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ఇనుగుర్తిలో 384, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలుర మరిపెడలో 384, టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలుర మానుకోటలో 286, టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలుర మరిపెడలో 360, టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలుర దామెరవంచ (గూడూరు మండలం)లో 312, టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలుర (యశోద గార్డెన్ సమీపంలో గల)లో 240, టీఎస్‌ఈఎంఆర్ఎస్ కురవిలో 240 వెరసి 2,974 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు చెప్పారు.

పల్లెపల్లెకు బీజేపీని విస్తరిస్తాం

- ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్
- గావ్ చలో పోగ్రాం పోస్టర్ల ఆవిష్కరణ



మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

మరిపెడ, ఫిబ్రవరి 10 : పల్లెపల్లెకు బీజేపీని విస్తరింపచేస్తామని పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు. శనివారం ఆయన పార్టీ మరిపెడ పట్టణ, మండల బాధ్యులతో కలిసి స్థానిక విశ్రాంతి భవన్‌లో గావ్‌చలో పోగ్రాం పోస్టర్లను ఆవిష్కరించి, విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేదరిక నిర్మూలనకు విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న పేదలందరికీ గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందచేయడం జరిగిందన్నారు. పల్లెలు, తండాలు, దళిత కాలనీల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా కేంద్రప్రభుత్వం సీసీ రోడ్లను నిర్మించిందన్నారు. ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు కార్యకర్తలు వివరించి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు భూక్యా కాంతమ్మ, పట్టణ అధ్యక్షుడు లింగంనాయక్, మరిపెడ మండల్ రూరల్ అధ్యక్షుడు బింగి రమేశ్ పాల్గొన్నారు.

లగ్గాలు షురూ..

నేటి నుంచి మాఘమాసం ప్రారంభం

- ఏప్రిల్ 26వ తేదీ వరకు వివాహాల కోలాహలం
- ఆ తర్వాత మూఢం, శూన్యమాసం
- ముందస్తుగా ఫంక్షన్‌హాళ్లు, క్యాటరింగ్ బుకింగ్‌లు



తొర్రూరు, ఫిబ్రవరి 10 : జిల్లాలో పెళ్లిళ్ల సందడి ప్రారంభం కానుంది. ఆదివారం (నేటి) నుంచి మాఘమాసం ప్రారంభం కానుండటంతో వావిహాలు జరిపించేందుకు యువతీయువకుల తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. మంచి రోజులు షురూ కానుండటంతో వివాహాల కోసం ఆయా తేదీల్లో ముహూర్తాలను పెట్టుకున్నారు.

మాఘమాసం నుంచి శ్రీకోది నామసంవత్సర చైత్రమాసం వరకు అంటే ఏప్రిల్ 20వ తేదీ వరకు మూడు నెలల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. సుమారు రెండు నెలలు విరామం అనంతరం మళ్లీ వివాహాలు మొదలవుతోండటంతో కల్యాణ మండపాల వద్ద పెళ్లి బృందాల సందడి మొదలుకానుంది. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మూడుముళ్లతో వందల సంఖ్యలో నవజంటలు ఒక్కటి కానున్నాయి. ఇందుకు అనుగుణంగా యువతీయువకులు, తల్లిదండ్రులు ముందస్తు మ్యారేజీ పనుల్లో బిజీగా ఉంటున్నారు.

ముహూర్తాలు ఇవే..

వివాహానికి యోగ్యమైన ముహూర్తాలను పండితులు సూచిస్తున్నారు. మాఘమాసం ప్రారంభం తదుపరి ఈనెల 13, 14, 17, 18, 24, 27, 28, 29, మార్చి 2, 3, 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్ 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24, 26 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఏప్రిల్ 28 నుంచి మూడం ప్రారంభం అవుతుండటంతో అక్టోబరు వరకు ముహూర్తాలు లేవని అర్చకులు తెలుపుతున్నారు.

ముందస్తు బుకింగ్‌లు..

జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యల్లో పెళ్లిళ్లు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే ముందస్తు పనులపై దృష్టిసారించారు. ఫంక్షన్ హాల్‌లు, క్యాటరింగ్, పురోహితులు, బాజాభజంత్రీలు, డెకరేషన్, ఆర్కెస్ట్రా, ఫొటో వీడియోగ్రఫీ, ప్రీవెడ్డింగ్ షూట్ స్టూడియోలు ఇలా పెళ్లికి అవసరమైన వాటిని ముందస్తుగా బుక్ చేసుకోవడంపై దృష్టి సారించారు. పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు ముందస్తు కొనుగోలు చేస్తున్నారు. ఫంక్షన్ హాల్‌లు అన్ని ఇప్పటికే చాలా వరకు బుక్ అయిపోయాయి.

ఊపందుకోనున్న వ్యాపారాలు..

పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రధాన పట్టణాల్లో వ్యాపారాలు జోరుగా సాగనున్నాయి. షాపింగ్ మాల్స్, బట్టల దుకాణాలు, లేడీస్ ఎంపోరియం, ఫంక్షన్ హాల్‌లు, క్యాటరింగ్, పురోహితులు, బాజా భజంత్రీలు, డెకరేషన్, ఆర్కెస్ట్రా, ఫొటో వీడియోగ్రఫీ, ప్రీవెడ్డింగ్ షూట్ స్టూడియోలు ఇలా పెళ్లికి అవసరమైన పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలపై దృష్టి సారించడంతో వ్యాపారం జోరందుకోనుంది. ఇప్పటికే వ్యాపారులు తమ దుకాణాల్లో అవసరమయ్యే సరుకులను ముందస్తుగా దిగుమతి చేసుకుని సిద్ధంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో వరంగల్, హన్మకొండ, నర్సంపేట, మహబూబాబాద్, జనగాం, భూపాలపల్లి లాంటి పట్టణాల్లో కోట్ల రూపాయల్లో వ్యాపారం జరగవచ్చని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మూడు నెలల్లో జోరుగా వివాహాలు

- వెన్నప్ప సంతోష్ శర్మ, పురోహితులు (సిద్ధాంతి)

ఈ ఏడాది వివాహ ముహూర్తాలు తక్కువగానే ఉన్నాయి. మాఘమాసం ప్రారంభం అవుతున్న ఈనెల 11వ తేదీ నుంచి శ్రీకోద నామసంవత్సర చైత్ర మాసం వరకు ఏప్రిల్ 26 వరకు మూడు నెలలపాటు సుమారు 30 వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఏప్రిల్ 25 నుంచి మూడం ప్రారంభం అవుతుంది. దీంతో వైశాఖం, జ్యేష్ఠ మాసంలో వివాహ ముహూర్తాలు లేవు. ఆ తర్వాత ఆషాడం శూన్యం కావడంతో శుభకార్యాలకు పనికిరాదు. మళ్లీ శ్రావణమాసం ఆగస్టు నుంచి తిరిగి వివాహాలు జరిపించుకోవచ్చు.

తాటికొండ దారెటు..?

కాంగ్రెస్‌లో చేరేందుకు రాజయ్య తీవ్రంగా ప్రయత్నాలు ● అపాయింట్‌మెంట్ ఇవ్వని కాంగ్రెస్ ఢిల్లీ నేతలు



వరంగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కాంగ్రెస్‌లో చేరికకు బ్రేకులు పడుతున్నాయి. రాజయ్యను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని ఒకవైపు సొంత నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనలు చేస్తుంటే.. మరోవైపు ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు సైతం రాజయ్యకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా దాటవేస్తున్నారు. దీంతో రాజయ్య బీఆర్ఎస్‌ను వీడే విషయంలో తొందరపడ్డారా? అనే చర్చ జరుగుతోంది.

3న బీఆర్ఎస్‌కు రాజీనామా

స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఈనెల 3వ తేదీన బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా ప్రకటించారు. తనకు పార్టీలో గౌరవం లేదని, కొన్నాళ్లుగా పార్టీలో క్షోభ అనుభవించానని ప్రకటించారు. త్వరలోనే ఏ పార్టీలో చేరేది వెల్లడిస్తానని తెలిపారు. అయితే ఈనెల 10వ తేదీన కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మీడియాకు లీకులు ఇచ్చారు. దీంతో రాజయ్య శనివారం కాంగ్రెస్‌లో చేరుతారని ఆయన అభిమానులు ఎదురుచూస్తు ఉండిపోయారు. అయితే రాజయ్య కాంగ్రెస్‌లోకి రావడాన్ని స్థానిక కాంగ్రెస్ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎట్టి పరిస్థితుల్లో రాజయ్యను పార్టీలోకి చేర్చుకోవద్దంటూ పార్టీ శ్రేణులు, ముఖ్యంగా మహిళ కార్యకర్తలు గాంధీభవన్ వద్ద ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేశారు. అయితే ఇవేమీ పట్టించుకోకుండా రాజయ్య శనివారం ఉదయమే ఢిల్లీకి వెళ్లారు. తెలంగాణ ఉద్యమంలో తాను పోషించిన పాత్రతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్‌లో తనకు ఉన్న బలం, బలగంతో కూడిన 30పేజీల నివేదికను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గేకు పంపించారు. అయితే అక్కడి నుంచి పార్టీలో చేరేందుకు ఎలాంటి పిలుపు రాకపోవటంతో తెలంగాణ భవన్‌లో రాత్రి వరకు ఎదురుచూసినట్లు సమాచారం. ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ.వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదని సమాచారం. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా మాత్రమే పార్టీలోకి రావాలని, సీఎంను కాదని తాము పార్టీలో చేర్చుకోలేమని కాంగ్రెస్ పెద్దలు తమ పీఏల ద్వారా తేల్చి చెప్పినట్టుగా ప్రచారం జరుగుతోంది.

కాగా, రాజయ్య చేరికకు ఓ మంత్రి సీఎం రేవంత్‌రెడ్డిని తొలుత ఒప్పించినట్లుగా సమాచారం. అయితే రాజయ్య రాజీనామాతో నియోజకవర్గంలో వ్యక్తమవుతున్న ఆందోళనలతో సీఎం సైతం వెనక్కి తగ్గినట్లుగా తెలిసింది. దీంతో రాజయ్య కాంగ్రెస్‌లో చేరికకు బ్రేకులు పడుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఆదివారం మరోసారి ప్రయత్నాలు చేయాలని రాజయ్య నిర్ణయించుకున్నట్లుగా సమాచారం. పార్టీలో చేర్చుకునేందుకు హామీ ఇచ్చిన మంత్రి సైతం ఫోన్ స్విచ్ఛాఫ్ చేయటంతో రాజకీయంగా రాజయ్య ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. అయితే కాంగ్రెస్ నుంచి సరైన హామీ లేకుండా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి రాజయ్య తొందరపడ్డారనే టాక్ వినబడుతోంది.

మేడారం జాతరలో నష్టపోయిన వ్యాపారులకు న్యాయం చేస్తాం..

ఎస్పీ హామీ ఇచ్చారు : పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు

మేడారం, ఫిబ్రవరి 10: వనదేవతల గద్దెల ముఖద్వారం వద్ద ఏర్పాటైన దుకాణాలను అధికారులు తొలగించిన ఘటనలో నష్టపోయిన వ్యాపారులకు న్యాయం చేస్తామని ఎస్పీ శబరీశ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు తెలిపారు. ఈ సంఘటన జరిగిన అనంతరం ఎస్పీ తనతో నేరుగా మాట్లాడారని చెప్పారు. గద్దెల ముఖద్వారం వద్ద పలువురు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేయగా భక్తుల రద్దీ నేపథ్యంలో ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో అదనపు కలెక్టర్ శ్రీజ శుక్రవారం రాత్రి వాటిని ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగింపజేసిన విషయం విదితమే. దీనిపై వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిసేపు అక్కడ నిరసనకు దిగారు. అధికారులు దుకాణాలను ధ్వంసం చేశారని, దీంతో నష్టపోయామని మండిపడ్డారు.

ఈ క్రమంలో ఎస్పీ శబరీశ్ తనతో నేరుగా మాట్లాడారని జగ్గారావు తెలిపారు. జరిగిన నష్టాన్ని వెంటనే భర్తీ చేస్తామని చెప్పారని పేర్కొన్నారు. వ్యాపారులు ఈ ఘటనను మరిచిపోయి జాతర విజయవంతానికి కృషి చేయాలని ఎస్పీ కోరారని తెలిపారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ద్వారా నష్ట అంచనాను వేశారని అన్నారు. జాతర సమీపిస్తుంటడంతో భక్తుల సౌకర్యాల దృష్ట్యా షాపులను తొలగించినట్టు స్పష్టం చేశారని జగ్గారావు తెలిపారు. అందరి సహకారంతోనే మహాజాతర విజయవంతమవుతుందని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారని చెప్పారు.

సీఐలు, ఎస్ఐల బదిలీలు

9మంది ఇన్‌స్పెక్టర్లు, 10 మంది ఎస్ఐలకు స్థానచలనం

ఉత్తర్వులు జారీ చేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 10: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 9 మంది ఇన్‌స్పెక్టర్లు, 10 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల తర్వాత తొలి విడతగా మూడు రోజుల కిందట 29 మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీ కాగా, తాజాగా మరో 9 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ జరిగింది. అయితే కొందరు ఒకే చోట ఎక్కువ కాలం పని చేయడంతో బదిలీ చేయగా, మరికొందరికి బదిలీ అయిన వారి స్థానాల్లో పోస్టింగ్ ఇచ్చారు. పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు.

సీఐల విభాగంలో..

పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రదేశం
ఎస్.వాసుదేవరావు	కమిషనరేట్	సుబేదారి
ఎం.ఏ షుకూర్	సుబేదారి	సీసీఆర్‌బీ
బి.రాజగోపాల్	కమిషనరేట్	పర్వతగిరి
సీహెచ్.శ్రీధర్	కమిషనరేట్	కేయూసీ
పి.రంజిత్‌రావు	కమిషనరేట్	శాయంపేట
డి.మల్లేశ్	శాయంపేట	మల్టీజోన్ ఐజీ అటాచ్
జి.మహేందర్‌రెడ్డి	వీఆర్	పాలకుర్తి
పి.దయాకర్	కమిషనరేట్	టాస్క్‌ఫోర్స్
ఎ.రాంబాబు	టాస్క్‌ఫోర్స్	మల్టీజోన్ ఐజీ అటాచ్

ఎస్ఐల విభాగంలో..

ఎస్.చెన్నకేశవులు	హనుమకొండ	దేవరుప్పుల
కె.శ్రవన్‌కుమార్	దేవరుప్పుల	వీఆర్
ఎం.సాయిప్రసన్నకుమార్	ఇంతేజార్‌గంజ్	పాలకుర్తి
టి.శ్రీకాంత్	పాలకుర్తి	వీఆర్
వి.సందీప్	హనుమకొండ	రాయపర్తి
డి.విజయ్‌కుమార్	రాయపర్తి	వీఆర్
అయ్యల శ్వేత	గీసుగొండ	తరిగొప్పుల
డి.నరేష్	తరిగొప్పుల	వీఆర్
బి.హరికృష్ణ	స్టేషన్ ఘన్‌పూర్	పీటీసీ వరంగల్
బి.రవీందర్	పరకాల	వీఆర్

అన్నీ మంచి శకునములే..

నేటి నుంచి శుభముహూర్తాలు

సుబేదారి, ఫిబ్రవరి 10: పెళ్లి మంగళవాయిద్యాలకు మంచిరోజులొచ్చాయి. నెల రోజుల విరామం తర్వాత శుభముహుర్తాలు వచ్చాయి. పుష్యమాసం (శూన్యమాసం) కావడంతో శుభ కార్యక్రమాలు ఇన్ని రోజులు జరగలేదు. శనివారం నుంచి మాఘమాసం ప్రారంభమైంది. దీంతో నేటి (ఆదివారం) నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు అన్ని మంచి రోజులు కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేల సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. ఈ నెల 14వ తేదీన వసంత పంచమి ఉండటంతో పెద్ద సంఖ్యలో శుభ కార్యాలకు ముహూర్తాలు ఉన్నాయి.

ఏప్రిల్ 9న ఉగాది తర్వాత ఏప్రిల్ 10 నుంచి 24 వరకు మాత్రమే మంచి రోజులు ఉన్నాయి. ఏప్రిల్ 30 నుంచి జూలై 10వ తేదీ వరకు గురు మూఢమి, శుక్రమూఢమి ఉన్నందున ఈ సారి మే, జూన్ మాసాల్లో మంచి రోజులు లేవని పురోహితులు అంటున్నారు. ఫిబ్రవరి నెలలో 13, 14, 17, 18, 24, 28, 29, మార్చి నెలలో 2, 3, 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్ నెలలో 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24 తేదీలలో మంచి రోజులు ఉన్నాయి.

మేడారం జాతరకు బస్ టికెట్ చార్జీల ఖరారు

సుబేదారి, ఫిబ్రవరి 10: వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు సమ్మక్క, సారలమ్మల జాతర జోరుగా సాగనుంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు మేడారం వెళ్లడానికి బస్సుల చార్జీలను ఖరారు చేశారు. హనుమకొండ బస్‌స్టేషన్, కాజీపేట, వరంగల్, పరకాల, చిట్యాల నుంచి మేడారంకు పెద్దలకు రూ.250కాగా, పిల్లలకు (5ఏళ్ల నుంచి 12 ఏళ్లలోపు) రూ.140చార్జీ చేయనున్నారు. అలాగే జనగామ నుంచి పెద్దలకు రూ.370, పిల్లలకు రూ.210, హైదరాబాద్ నుంచి పెద్దలకు రూ.550, పిల్లలకు రూ.310, హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి పెద్దలకు రూ.600, పిల్లలకు రూ.320, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.180, నర్సంపేట నుంచి పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.150, కొత్తగూడ నుంచి పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.170 ఖరారు చేశారు.

మహబూబాబాద్ నుంచి పెద్దలకు రూ.350, పిల్లలకు రూ.190, గూడూరు నుంచి పెద్దలకు రూ.280, పిల్లలకు రూ.160, తొర్రూర్ నుంచి పెద్దలకు రూ.350, పిల్లలకు రూ.190. వర్ధన్నపేట నుంచి పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.160 ఖరారు చేశారు. ఆత్మకూరు నుంచి పెద్దలకు రూ.210, పిల్లలకు రూ.120, మల్లంపల్లి నుంచి పెద్దలకు రూ.180, పిల్లలకు రూ. 110, ములుగు నుంచి పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.90, భూపాలపల్లి నుంచి పెద్దలకు రూ.220, పిల్లలకు రూ.130, ములుగు గణపురం నుంచి పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.110, జంగాలపల్లి నుంచి పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.90, పస్రా నుంచి పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.50, గోవిందరావుపేట నుంచి పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.60, తాడ్వాయి నుంచి పెద్దలకు రూ.60, పిల్లలకు రూ.40గా టికెట్ చార్జీలు కేటాయించారు.



భీమునిపాదంలోని అటవీప్రాంతంలో రెండు తలల పామును వదిలేస్తున్న అటవీశాఖ అధికారులు

నాజీతండాలో రెండు తలల పాము లభ్యం

● భీమునిపాదం అటవీప్రాంతంలో వదిలివేత

గూడూరు, ఫిబ్రవరి 10 : గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని భూపతిపేట సెక్షన్ శివారు నాజీతండాలో రెండు తలల పాము శనివారం లభ్యమైంది. తండావాసులు అటవీక్షేత్రస్థాయి అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అధికారులు అక్కడికి చేరుకుని రెండు తలల పామును స్వాధీనం చేసుకుని భీమునిపాదం అటవీ ప్రాంతంలో పామును వదిలేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, బీట్ అధికారులు మంగమ్మ, బిక్షపతి పాల్గొన్నారు.

ముగిసిన అగ్రికల్చర్ విద్యార్థుల ప్రాజెక్టు వర్క్

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి10 : వరంగల్ వ్యవసాయ కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు చేపట్టిన ప్రాజెక్టు వర్క్ శనివారంతో ముగిసింది. చివరి రోజు ఈ విద్యార్థులు మహబూబాబాద్ మండలంలోని శనిగపురం, పర్వతగిరి గ్రామాల్లో ప్రాజెక్టు వర్క్‌ను పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ వ్యవసాయ వాతావరణ చిత్రపటాన్ని రంగురంగుల ముగ్గులను వేసి, ప్రజలను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే మల్యాల కోఆర్డినేటర్ మాలతి పాల్గొని విద్యార్థులకు సాగుకు అవసరమైన వనరులు, వివిధ రకాల పంటల ప్రాధాన్యతపై, వ్యవసాయ కాలచక్రంపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అగ్రికల్చర్ విద్యార్థులు ఎ.సాయిప్రసన్న, వి.సౌమ్య, శ్రీవెన్నెల, వాసవి, సాయిశ్రియ, స్వాతి, సాహితీ, కీర్తన, తేజస్విని, సంధ్య నెల రోజుపాటు గ్రామీణ వ్యవసాయ సాగు అనుభవంపై అధ్యయనం చేశారు. శాస్త్రవేత్త కిశోర్, హేమశరత్‌చంద్ర, సౌజన్య, ఏఈవో రాజ్యలక్ష్మి, దయాకర్, రవీందర్, మహేందర్‌రెడ్డి, బీరయ్య, జనార్దన్, రమేష్, సంపత్‌రెడ్డి, మహేందర్, యాకయ్య, లింగయ్య, ఐలయ్య పాల్గొన్నారు.



ఇనుగుర్తిలో చిత్రలేఖనం ద్వారా వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

● గూడూరు : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు కొల్లాపురంలోవ్యవసాయ క్షేత్రప్రదర్శన నిర్వహించారు. భూమి రకాలు, పండిన పంటలు, రకాలు, నీటి వనరులు, పంటల మార్పిడి గురించి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏడీ బలరాం, యూనివర్సిటీ విద్యార్థులు, మాజీ సర్పంచులు ముక్కా లక్ష్మణ్‌రావు, సుధాకర్‌రావు, ఎంపీటీసీ కవిత, వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

● ఇనుగుర్తి : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు శివలింగారెడ్డి, శ్రీరాం, సాయితరుణ్, శ్రీకర్ ఇనుగుర్తి మండలంలోని రైతువేదికలో పార్టిసిపెటరీ రూరల్ అప్రైజల్ అనే ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడతాయో చిత్ర రూపంలో ప్రదర్శించారు. అలాగే గ్రామంలోని పంటలు ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయో.. నీటి వనరుల వివరాలను, వ్యవసాయ పరిస్థితులకు సంబంధించిన వాటిని చిత్రలేఖనం ద్వారా అవగాహన కల్పించారు. బలరామ మారుతి, ప్రత్యేక అధికారి సూర్యనారాయణ, మల్యాల మల్యాల కోఆర్డినేటర్ మాలతి, ఏఈవో మురళి పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ..

● ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన నరేష్

మరిపెడ రూరల్, ఫిబ్రవరి10 : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని పురుషోత్తామాయగూడెం వద్ద చోటు చేసుకుంది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని తండా ధర్మారంనకు చెందిన మద్దోజు నరేష్ ద్విచక్రవాహనంపై పని నిమిత్తం మండల కేంద్రానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో పురుషోత్తామాయగూడెం వద్ద, మరిపెడ నుంచి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం హైదర్‌సాయిపేటకు వెళ్తున్న మరో బైక్ వెనుక నుంచి ఢీకొనగా తీవ్రగాయాలపాలైన నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య ఉంది. కాగా ఈ ఘటనలో మరో బైక్‌పై ఉన్న గుగులోతు మంగీలాల్, దాసరి మహేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మూడు కలప ట్రాక్టర్లు సీజ్

దంతాలపల్లి, ఫిబ్రవరి 10 : ఇటుక బట్టీలకు అక్రమంగా కలపను తరలిస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం బీరిశెట్టిగూడెం శివారు, మండల కేంద్రం శివారులో దంతాలపల్లి పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గరిపై కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఎస్సై రమేష్‌బాబు మాట్లాడుతూ మండలంలోని రేపోణి గ్రామానికి చెందిన మధు, రాంరెడ్డి, యాకయ్యలు స్వంత ట్రాక్టర్లలో తరలిస్తున్న కలపను మండలకేంద్రం శివారు బాలాజీ ఫంక్షన్ హాల్ శివారులో ఓ కలప ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోగా మరోరెండు ట్రాక్టర్లను బీరిశెట్టిగూడెం శివారు చెరువు కట్టపై స్థానికుల ఫిర్యాదు మేరకు స్వాధీనం చేసుకుని కలప ట్రాక్టర్లను ఫారెస్టు అధికారులకు అప్పగించామన్నారు. వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటివారైన సహించేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, ప్రకాష్‌రాజ్, గణేష్ పాల్గొన్నారు.

‘సేవాలాల్ జయంతిని సక్సెస్ చేయండి’



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 10 : గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీసూర్యచంద్ర శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ ట్రస్టు ఆధ్వర్యంలో అనంతాద్రి సమీపంలో సేవాలాల్ గుడి వద్ద గత 10 సంవత్సరాలుగా సేవాలాల్ జయంతి ఉత్సవాలను జరుపుతున్నట్లు చెప్పారు. అనంతాద్రి సమీపంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహనీయులు సేవాలాల్ గుడిని నిర్మించనున్నట్లు వివరించారు. ఈ నెల 14న భోగ్‌బండారో, 15న సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని స్థానిక తహసీల్ ఆఫీస్ నుంచి సేవాలాల్‌గుడి వరకు ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లూనావత్ అశోక్‌నాయక్, ఆంగోతు కిషన్, దామునాయక్, రెడ్యాగుగులోతు రాజు, బానోత్ రాము, మల్సూర్, గిరిజన సంఘాల నాయకులు గుగులోతు బీమా, రాంచందర్, రాందాసు, మంగిలాల్, నవీన్, మంగిలాల్, ఇస్లావత్ నరేష్ పాల్గొన్నారు.

‘కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి’



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తొర్రూరు, ఫిబ్రవరి 10 : అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు అన్నారు. శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఈనెల 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని గొప్పలు చెప్పుకుంటున్న మోదీ ఉచిత బియ్యాన్ని 49శాతం మంది ప్రజలేఎందుకు తీసుకుంటున్నారో ఆలోచించాలన్నారు. రైతాంగానికి ఇచ్చిన హామీలను విస్మరించారని, కార్మిక చట్టాలను రద్దుచేశారని, స్వామినాథన్ కమిషన్ రైతుకు గిట్టుబాటు ధర చట్టం తీసుకురావాలని రాతపూర్వకంగా ఇచ్చినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. 16న జరిగే సమ్మెకు కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓమ భిక్షపతి, కొత్తపల్లి రవి, బొల్లం అశోక్, వీరన్న, బీకూ, శ్రీను, దూలం శ్రీనివాస్, వెంకన్న, మల్లయ్య, మహేష్ పాల్గొన్నారు.

హత్యాయత్నం చేసిన వ్యక్తి రిమాండ్



వ్యక్తిని అరెస్టు చూపుతున్న ఎస్సై జగదీష్

తొర్రూరు, ఫిబ్రవరి 10 : సొంత అక్కపై హత్యాయత్నం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని మాటేడు గ్రామానికి చెందిన మాంకాళి వెంకన్న మద్యానికి బనిసై ఈనెల 6న మద్యం సేవించడానికి తన సొంత అక్క ఉప్పలమ్మను డబ్బులు అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో ఆమెపై కక్ష పెంచుకుని ఇంటి నుంచి బయటికి రావడం కోసం కాపుకాసి అంబేద్కర్ విగ్రహం వద్దకు రాగానే గొడ్డలితో దాడి చేశాడు. గమనించిన స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆమెను రక్షించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంకన్నపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.

గూడూరుకు చేరిన మేడారంకు వెళ్లే పాదయాత్ర

గూడూరు, ఫిబ్రవరి 10 : ఖమ్మం జిల్లా కేంద్రంలో పాకబండ బజారుకు చెందిన బేడ బుడిగ జంగాలు ఈనెల 7వ తేదీన ఖమ్మంలో ప్రారంభించిన పాదయాత్ర శనివారం గూడూరుకు చేరుకుంది. ఖమ్మం నుంచి మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర వరకు 210 కిలోమీటర్లను మేర పాదయాత్ర నిర్వహించనున్నట్లు భక్తులు చెప్పారు. తిరవాటి శ్రీను, కొండపల్లి ఎంజేఆర్, పస్తం శేషయ్య, పద్మావతి, తిరుపతమ్మ, కనకమహాలక్ష్మిలు కోరుకున్న కోరికలు తీరాలని వనదేవతలను దర్శించుకునేందుకు పాదయాత్రచేపట్టినట్లు తెలిపారు.

ఎంపీగా అవకాశం కల్పిస్తే పోటీ చేస్తా

● డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్

గూడూరు, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ పార్టీ తరుపున మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్‌ను తనకు కేటాయిస్తే పార్లమెంట్ బరిలో ఉంటానని ఉమ్మడి వరంగల్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ లకావత్ ధన్వంతి భర్త డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్ అన్నారు. గూడూరు మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎస్టీ రిజర్వుడ్ కావడంతో పార్టీ తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుగులోతు భీమానాయక్, వాంకుడోతు మంగీలాల్, రాందాస్‌నాయక్, గోపినాయక్, చందులాల్‌నాయక్, రాంబాయి, సుజాత పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ప్రైవేట్ స్కూల్ బస్సు

● ఊరిపక్క తండాకు చెందిన వ్యక్తి మృతి

మరిపెడ రూరల్, ఫిబ్రవరి 10 : ప్రైవేట్ స్కూల్ బస్సు బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బుర్హాన్‌పురం వద్ద 365 జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. గుండెపుడి శివారు ఊరిపక్క తండాకు చెందిన బాదావత్ శంకర్ (28) రెండురోజుల క్రితం బొడ్రాయి పండుగకు అత్తగారి ఊరైన చివ్వేంల మండలం కందగట్ల తండాకు వెళ్లాడు. శనివారం ఉదయం గుండెపుడికి వస్తున్న క్రమంలో బుర్హాన్‌పురం వద్ద 365 జాతీయ రహదారిపై, మరిపెడ నుంచి ఎస్‌వీఎం ప్రైవేట్ స్కూల్ బస్సు తానంచర్లకు వెళ్తుండగా బుర్హాన్‌పురం వద్ద బైక్‌ను, బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై వెళ్తున్న శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులు, కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో మరిపెడ అదనపు ఎస్సై మౌలాన ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. శంకర్‌కు భార్య కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్సై తెలిపారు.

విద్యకు ప్రాధాన్యతం ఇవ్వని రాష్ట్ర బడ్జెట్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 : విద్యారంగానికి రాష్ట్రబడ్జెట్ ప్రాధాన్యతనివ్వకపోవడం విచారకరమని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని పేర్కొన్నప్పటికీ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 6.5 శాతం కేటాయించడం శోచనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు, మరుగుదొడ్ల నిర్వహణ గూర్చి ప్రస్తావించకుండా రాబోయే ఇంటర్నేషనల్ స్కూళ్లకు రూ. 500 కోట్లు కేటాయించడం శోచనీయమన్నారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ. 3000 కోట్లుకోరగా కేవలం రూ.500 కోట్లు కేటాయించడంతో ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం మాదిరిగానే విద్యారంగంపై నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు

‘మత రాజకీయాలను వ్యతిరేకించండి’

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న మత రాజకీయాలను వ్యతిరేకించాలని ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడీ జబ్బార్ కోరారు. మహబూబాబాద్‌లో శనివారం ఈనెల 16 జరిగే దేశావ్యాప్త గ్రామీణాబంద్ సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ సమ్మెకు కార్మికులు, రైతు సంఘాల నేతలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, హుస్సేన్, రాము, కల్యాణ్, ముత్తయ్య, సైదులు, భావ్‌సింగ్, వేణు, భారత్, శంకర్, ప్రవీణ్, కిషన్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం వినతి

కేసముద్రం, ఫిబ్రవరి 10 : కేసముద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జాటోత్ బిచ్చానాయక్, కేతిరి ఉప్పలయ్య ఉన్నారు.

‘ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయవద్దు’



మందులు అందజేస్తున్న డాక్టర్ కుమారస్వామి, సీపీఎం ఫ్లోర్ లీడర్ సోమయ్య

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 10 : ఆరోగ్యం పట్ల ఎవరు అశ్రద్ధ చేయవద్దని సీనియర్ ఫిజిషియన్, ప్రముఖ వైద్యుడు టి.కుమారస్వామి అన్నారు. మహబూబాబాద్ పట్టణ శివారు గుమ్మూనూర్‌లో స్థానిక వార్డు కౌన్సిలర్, సీపీఎం ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో మునిసిపల్ 29,30 వార్డుల పరిధిలోని ప్రజలు పాల్గొనగా, వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ వ్యాధుల నివారణకు రోజుకు 45 నిమిషాల పాటు వాకింగ్ చేయాలని తెలిపారు. 152 మందికి వైద్యపరీక్షలు నిర్వహిస్తే అందులో 84 మందికి బీపీ, షుగర్ నిర్ధారణ అయిందని వారికి మందులను పంపిణీ చేసినట్లు చెప్పారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ సోమయ్య మాట్లాడుతూ ఎంతో విలువైన సమయాన్ని వెచ్చించి తమ వార్డుల్లో వైద్యశిబిరం ఏర్పాటు చేసిన వైద్యులు కుమారస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్నపు సావిత్రి, చీపిరి యాకయ్య, నూనె శ్రీనివాస్, విజయలక్ష్మి, కిరణ్, నరేష్, కుమార్ సమ్మయ్య, జానీ,సురేష్, వెంకన్న, వైద్యసిబ్బంది భాస్కర్‌రావు, శ్రీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

సత్యనారాయణపురంలో రామాలయ పునర్‌నిర్మాణం

● నేటి నుంచి అంకురారోహణ

● 14న విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన కోసం ఏర్పాటు చేసిన యాగశాల



సత్యనారాయణపురంలో నిర్మించిన రామాలయం

బయ్యారం, ఫిబ్రవరి 10 : మండలంలోని సత్యనారాయణపురంలో రామాలయం ఆలయాన్ని నూతనంగా పునఃనిర్మించారు. దేవాదాయశాఖ, గ్రామస్థుల సహాయ సహకారాలతో చేపట్టిన ఈ ఆలయ పునఃనిర్మాణానికి 2021 అక్టోబరు 25న శంకుస్థాపన చేశారు. పనులు పూర్తికావడంతో గ్రామస్థులు విగ్రహ ప్రతిష్ఠాపనను చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆదివారం అంకురారోహణతో ప్రారంభమైయ్యే ఈ పూజా కార్యక్రమాలు ఈనెల 14న జరిగే విగ్రహ-ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనతో పూర్తవుతాయి. భద్రాచలం శ్రీకోదండ రామచంద్రస్వామి ఆలయానికి చెందిన వేద పండితులు, పూజారులతో ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమ నిర్వాహణ కొనసాగనున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. కాగా, 14 సాయంత్రం శ్రీసీతారామ కల్యాణం జరగనున్నట్లు వెల్లడించారు. ఆదివారం (నేడు) విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనము, మృత్యం గ్రహణం, అంకురారోహణ, సోమవారం గోపూజతోటి ఆహ్నికము ప్రారంభం, చతుస్థానార్చన, అగ్నిప్రతిష్ఠాపన, మహామంత్ర హోమం, సంక్షిప్త రామాయణ హవనం, పంచగవ్యాధి వాసం, నిత్యపూర్ణహుతి కార్యక్రమాలు జరుగనున్నాయి.

అలాగే మంగళవారం చతుస్థానార్చన, సుందర కాండ సహిత మన్యుసూక్త హవనములు, క్షీరాభివాసము, విశేషహవనములు, జలాభివాసం మంగళాశాసనం, బుధవారం చతుస్థానార్చన, మహాపూర్ణాహుతి, యంత్రములకు అభిషేకం, విగ్రహ-ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహా కుంభాభిషేకం ప్రథమ ఆరాధన అర్చన, దిష్టి కుంభము, గోపృష్ఠ దర్శనము భగవద్దర్శనం, సాయంత్రం శ్రీసీతారామ కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు జరుగనున్నాయి.

మైనర్‌పై అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడి అరెస్టు

చెన్నారావుపేట(వరంగల్ జిల్లా), ఫిబ్రవరి 10 : మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మహబుబాద్ జిల్లా గూడురు మండలం చిర్రకుంట తండాకు చెందిన బానోతు ఈరు చెన్నారావుపేట మండలంలో 9వ తరగతి చదువుతున్న (14) సంవత్సరాల బాలిక పాఠశాలకు వస్తున్న క్రమంలో లిఫ్టు ఇచ్చి ద్విచక్ర వాహనాన్ని ఎక్కించుకున్నాడు. గ్రామ శివారులోకి రాగానే బాలికపై హత్యాచారయత్నానికి పాల్పడ్డారన్నారు. తప్పించుకున్న బాలిక జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు తెలుపడంతో, వారు పోలీసులకు ఫిర్యాదు చేయటం జరిగిందన్నారు. నిందితుడు ఈరుపై కేసు నమోదు చేసి, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

‘పశుమిత్రల వేతనాలను నిర్ణయించాలి’

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 10 : తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న పశుమిత్రల కనీస వేతనాన్ని నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథంభవన్‌లో శనివారం సీఐటీయూ అనుబంధ పశుమిత్ర వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ సడక్‌బంద్‌లో పశుమిత్రలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం మహిళా పొదుపు సంఘాల్లో చురుకుగా పని చేసిన వారిని గుర్తించి శిక్షణ ఇచ్చారని వారు పశు వైద్యశాఖలో గ్రామీణ ప్రాంతాల్లో పశువులు, గొర్రెలు, మేకలు, గేదేలవంటి మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. వారికి కనీస వేతనం నిర్ణయించకపోవడం బాధకరమన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు కొత్త రజిని, గుగులోతు ఝాన్సీ, భూక్య అరుణ పాల్గొన్నారు.

గృహజ్యోతి సర్వేను పరిశీలించిన డీఈ

కేసముద్రం, ఫిబ్రవరి 10 : రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించే గృహజ్యోతి పథకం సర్వేను శనివారం మహబూబాబాద్ ట్రాన్స్‌కో డీఈ విజయ్‌కుమార్ పరిశీలించారు. విద్యుత్ మీటరు సర్వీస్, రేషన్‌కార్డు, ఆధార్, సెల్ నెంబర్లను సేకరించి అనుసంధానం చేస్తున్న విషయాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఈ రాజు, శ్రీనివాస్, జయంత్‌కుమార్ పాల్గొన్నారు.

‘రైతు రుణమాఫీపై ప్రభుత్వం విధి విధానాలను ప్రకటించాలి’



మాట్లాడుతున్న నాగమణి

గార్ల, ఫిబ్రవరి 10 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాల్లోభాగమైనరూ. 2.లక్షల రైతు రుణమాఫీకి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విధి విధానాలను ప్రకటించాలని బీజేపీ మహిళ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గెండెబోయిన నాగమణిడిమాండ్ చేశారు. శనివారం స్థానిక వరక్త సంఘం భవనంలో బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు ఖరీఫ్ పంటల్లో తీరని నష్టజరిగిందని దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకపోయారన్నారు. బీజేపీ నాయకులు యశ్వత్ ఠాకుర్, తోడేటి నాగరాజు, జంపాల శ్రీను, అజ్మీరా రామునాయక్, దేవానాయక్, వడ్డెపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

గార్ల, ఫిబ్రవరి 10 : మండల కేంద్రంలోని తహసీల్దార్ బజారుకు చెందిన షేక్.మదార్‌బేగ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న ఇల్లందు ఎమ్మెల్యే కనకయ్య శనివారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. తొలుత అంబేద్కర్‌నగర్‌లోని కాంగ్రెస్ నాయకులు గులగట్టు లెనిన్ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కోరం సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్ నాయుడు, తాళ్లపల్లి కృష్ణాగౌడ్, అఫ్జల్, అశోక్, యాకూబ్‌పాష, సర్వర్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన నోడల్ అధికారి తిల్లైవల్.బీ

మహబూబాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ను శనివారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌తో కలిసి ఈవీఎం నోడల్ అధికారి తిల్లైవల్.బి సందర్శించారు. గోడౌన్‌లలో ఈవీఎంల పర్యవేక్షణను పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఏవో వెంకటరమణ, ఎన్నికల విభాగం అధికారి పవన్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సురేష్‌నాయుడు, మార్నేని కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

టీజీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హరినాయక్

గార్ల, ఫిబ్రవరి 10 : తెలంగాణ గిరిజన సంఘం మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గార్ల మండలంలోని ముత్తి తండాకు చెందిన భూక్యా హరినాయక్‌ను నియమించారు. గత అనేక సంవత్సరాలుగా సీపీఎం అనుబంధ సంఘమైన తెలంగాణ గిరిజన సంఘంలో క్రీయ శీలకంగా పని చేస్తున్నాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన జిల్లా మహాసభలో హరినాయక్‌ను ఎకగ్రీవంగా ఏన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తండాల్లో నెలకొన్న గిరినుల సమస్యలపై తనవంతు పోరాటం చేస్తానన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

● టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సాయిబాబు



మన్నెగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సీరోలు, ఫిబ్రవరి 10 : ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈనెల 11, 12 తేదీల్లో జరిగే తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీయ విద్యావైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి సాయిబాబు పిలుపునిచ్చారు. సీరోలు మండలం మన్నెగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాసభల వాల్ పోస్టర్లరు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కొంపెల్లి రామయ్య, తోట రమేష్, సాహెబ్ అలీ, రామన్న, శ్రీధర్, వినోద్‌కుమార్, మంజుభార్గవి, ఉప్పలయ్య, మహబూబ్ అలీ, కపిల్ పాల్గొన్నారు.

మేడిగడ్డకు సీఎం రేవంత్‌రెడ్డి

(5వ పేజీ తరువాయి)

బ్యారేజీని ఎల్‌అండ్‌టీ కంపెనీ పునరుద్ధరించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒత్తిడి తెచ్చారు. ఆ తరువాత డిసెంబరు 29వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి కుంగిన ప్రాంతాన్ని పరిశీలించింది. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగస్వామ్యమైన ఈఎన్‌సీలు మురళీధర్, నల్ల వెంకటేశ్వర్లుతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇప్పించారు. మీడియాతో పాటు మంత్రుల బృందం పర్యటనతో ప్రజల్లో మేడిగడ్డ బ్యారేజీ కుంగటంపై ఆసక్తి కలిగింది.

అయితే తాజాగా స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈనెల 13వ తేదీన ఎమ్మెల్యేలతో కలిసి మేడిగడ్డ బ్యారేజీని పరిశీలిస్తామని, అసెంబ్లీ నుంచే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. కాగా, మొత్తానికి మేడిగడ్డ బ్యారేజీలో జరిగిన అవినీతి ప్రజల్లోకి పూర్తిస్థాయిలో తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సీఎం, ఎమ్మెల్యేల పర్యటన నేపథ్యంలో మేడిగడ్డ వద్ద భారీ భద్రత ఏర్పాట్లకు డీజీపీ నుంచి పోలీసులకు ఆదేశాలు అందాయి.

అది మల్లమ్మ అంత్యక్రియలు పూర్తి

● కుటుంబసభ్యులను పరామర్శించిన ప్రముఖులు



అది మల్లమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్న బంధువులు, గ్రామస్తులు

గూడూరు, ఫిబ్రవరి 10 : మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఆది మల్లమ్మ (102) మృతదేహానికి కుటుంబసభ్యులు శనివారం అత్యక్రియలను పూర్తి చేశారు. మల్లమ్మ మృతదేహానికి ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రెండు కిలోమీటర్ల మేర అంతిమయాత్ర నిర్వహించి వారిస్వస్థలంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. మల్లమ్మ పెద్దకుమారుడు ఆది వీరసోములు తలకొరివి పెట్టారు. కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు. ఆది వీరసోమయ్య, మాద సోమక్క, గాజుల ధనమ్మ, సోమయ్య, మాదాసు భాగ్యమ్మ, ఉప్పలయ్య, బండి అనూరాధ, అంజయ్య, ఆది శ్రీనివాస్, ఆది ఆనంద్, బండి వరుణ్, మాదాసు రమేష్, గాజుల రవి, గాజుల లక్ష్మణ్, సోమయ్య, రామయ్య, అంజనేయులు, జెట్ట వెంకన్న, వేణు, వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 10 : మండలంలో అమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యహరించి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణతో ఉండి ఉన్నతమైన స్థానాలు అధిరోహించాలన్నారు. స్వయం పరిపాలనలో హెచ్‌ఎంగా కిన్నెర తులసి, ఎంఈవోగా పస్తం వినోద్ వ్యవహరించగా మరి కొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులు వ్యహరించి ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హరికృష్ణ, వెంకన్న, శ్రీనివాసచార్యులు, రత్నశేఖర్, రమేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

13న మండల సర్వసభ్య సమావేశం

తొర్రూరు, ఫిబ్రవరి 10: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి, తదితర అంశాలపై మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీ మంగళవారం ఎంపీపీ టీసీ అంజయ్య అధ్యక్షతన తొర్రూరు ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని, ఈసభకు ఆయా శాఖల అధికారులు తగు నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

పేద విద్యార్థినులకు సైకిళ్లు ఇవ్వడం అభినందనీయం



కేసముద్రం విలేజిలో విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న తహసీల్దార్ దామోదర్

కేసముద్రం, ఫిబ్రవరి10 : ప్రభుత్వ పాఠశాలల్లోని నిరుపేద విద్యార్థినులకు స్కూల్‌కు వచ్చేందుకు సైకిళ్లు అందించడం అభినందనీయమని తహసీల్దార్ తాళ్లూరి దామోదర్ అన్నారు. కేసముద్రం విలేజి హైస్కూల్లో శనివారం వరంగల్ రోటరీ క్లబ్, తొనుపునూరి వెంకటేశ్వర్లు సంయుక్త ఆధ్వర్యంలో 9 మంది విద్యార్థినీలకు సైకిళ్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఒక్కో సైకిల్‌కు రూ.4500 రోటరీ క్లబ్, రూ.2వేలు తొనుపునూరి వెంకటేశ్వర్లు సమకూర్చి రూ.6300 చొప్పున 9మందికి సైకిళ్లను పంపిణీ చేశారని తెలిపారు. ఇందులో కేసముద్రం విలేజి, కోమటిపల్లి హైస్కూళ్ల నుంచి నలుగురు చొప్పున ఒకరు ఆలేరు హైస్కూల్ విద్యార్థినులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు కొత్త జగన్మోహన్‌రెడ్డి, ఎ.జ్యోతి, రావుల మురళి, హరినాథ్ పాల్గొన్నారు.